
సాయి 100 యాప్ ఏర్పాటు

● శతజయంతి సమాచారం సమస్తం నిక్షిప్తం: కలెక్టర్

పుట్టపర్తి టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాల సందర్భంగా జిల్లా పరిపాలన విభాగం పుట్టపర్తికి వచ్చే ప్రజలు, భక్తులకు సమాచారం ఇచ్చేందుకు క్యూఆర్ కోడ్‌తో కూడిన సాయి(ఎస్ఏఐ)100 యాప్‌ను అందుబాటులో తీసుకువచ్చినట్లు కలెక్టర్ శ్యాంప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిపాలన విభాగం అభివృద్ధి చేసిన ఈ యాప్‌లో సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాలకు సంబంధించిన పూర్తి సమాచారం లభిస్తుందన్నారు. రోజువారి కార్యక్రమాలతో పాటు పుట్టపర్తి ప్రజలు, భక్తుల కోసం కల్పించిన సౌకర్యాల సమగ్ర సమాచారం ఈ యాప్ ద్వారా సులభంగా తెలుసుకోవచ్చన్నారు. వసతి, వాహనాల పార్కింగ్ ప్రాంతాలు, ఐదు ప్రథమ చికిత్స కేంద్రాలు, అత్యవసర సేవలు, సమాచార కేంద్రాలు, ఫిర్యాదులు, కమాండ్ కంట్రోల్ సెంటర్, ఆహార పంపిణీ కేంద్రాలు, తాగునీటి పాయింట్లు, పుట్టపర్తి చుట్టూ ప్రదేశాలు, తదితర అంశాల గురించి సమగ్ర సమాచారాన్ని తెలుసుకునేందుకు ఈ యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.



క్యూఆర్ కోడ్‌తో ఏర్పాటు చేసిన సాయి100 యాప్

ఆదర్శప్రాయుడు బిర్సాముండా

● కలెక్టర్ శ్యాంప్రసాద్

పుట్టపర్తి టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గిరిజన, బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సాముండా నేటి సమాజానికి ఆదర్శప్రాయుడని కలెక్టర్ శ్యాంప్రసాద్ కొనియాడారు. బిర్సాముండా జయంతిని పురస్కరించుకుని నిర్వహిస్తున్న జనజాతీయ గౌరవ్ దివస్‌ను శనివారం కలెక్టరేట్‌లో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ బిర్సాముండా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డీఆర్వో సూర్యనారాయణరెడ్డి, కలెక్టరేట్ ఏఓ వెంకట నారాయణ, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి మోహన్ రామ్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.


బిర్సాముండా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ శ్యాంప్రసాద్


ప్రత్యేక అలంకరణలో మహాసమాధి


పుట్టపర్తిలో అలరిస్తున్న లేజర్ షో



సత్యసాయి సేవలు అమూల్యం

● కొనియాడిన కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

● మూడో రోజు ఘనంగా శత జయంతి వేడుకలు



పాల్గొన్న భక్తులు, పాటలు పాడుతున్న దానా గెలస్పీ (ఇన్‌సెట్‌లో)

పుట్టపర్తి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రశాంతి నిలయంలో సత్యసాయి శత జయంతి వేడుకలు శనివారం మూడో రోజు ఘనంగా జరిగాయి. సత్యసాయి మహాసమాధిని ప్రత్యేకంగా అలకంరించి పూజలు చేశారు. విద్యార్థుల వేద పఠనంతో వేడుకలు ప్రారంభమయ్యాయి. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ సతీ సమేతంగా వేడుకలలో పాల్గొన్నారు. సత్యసాయి మహా సమాధిని దర్శించుకున్నారు. ప్రముఖ ప్రాశ్చాత్య గాయని దానా గెలాక్సీ సత్యసాయి

(మిగతా 7వ పేజీలో)

ప్రజల సమస్యలు పరిష్కరించాలి

● ఎమ్మెల్యే బాలకృష్ణ

చిలమత్తూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ అధికారులకు సూచించారు. నియోజకవర్గ పర్యటనలో భాగంగా ఆయన శనివారం బెంగళూరు నుంచి వస్తూ చిలమత్తూరు మండలం కొడికొండ వద్ద ఓ ప్రైవేటు గెస్ట్ హౌస్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అన్ని శాఖల అధికారులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యలపై ఏమరుపాటు వద్దని, సమస్యతో వచ్చిన ప్రతి ఒక్కరికి పరిష్కారం చూపాలన్నారు. విద్యుత్, ఉపాధి, పంచాయతీ రాజ్, రెవెన్యూ శాఖలతో ఆయన సమీక్ష జరిపారు. కోడూరు పంచాయతీ మన్రో తోపు ఆక్రమణలపై ఎంపీడీఓ రమణమూర్తి, పంచాయతీ కార్యదర్శి భాస్కర్‌లతో అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ స్థలాల ఆక్రమణలను అడ్డుకోవాలని, వేలం పాట ద్వారా దుకాణాల నిర్వహణకు చర్యలు తీసుకొని పంచాయతీ ఆదాయం పెరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, మండల కన్వీనర్ శ్రీనివాసులు, స్థానిక టీడీపీ నాయకులు నాగరాజుయాదవ్, బేకరీ గంగాధర్, శ్రీదేవి, లక్ష్మీనారాయణ యాదవ్, రంగారెడ్డి, తిప్పారెడ్డి, బాలాజీ, నంజుండప్ప తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో ప్రజా సమస్యలపై సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బాలకృష్ణ

రెచ్చగొట్టారు.. రెచ్చిపోయారు..!

● పురం వైసీపీ కార్యాలయంపై దాడి

● ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలే కారణం

వైసీపీ కార్యాలయంపై దాడి చేస్తున్న టీడీపీ శ్రేణులు



హిందూపురం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వైసీపీ కార్యాలయంపై టీడీపీ శ్రేణులు శనివారం దాడి చేశాయి. ఫర్నిచర్, అద్దాలు, పార్టీ ప్రచార వాహనాన్ని ధ్వంసం చేశాయి. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణపై వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దీపిక భర్త వేణు రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆగ్రహించారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను ఆపాలని లేపాక్షి మండలం శిరివరంలో వైసీపీ నాయకులు శనివారం కోటి సంతకాల సేకరణ, రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వేణురెడ్డి మాట్లాడుతూ, 'ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ హైదరాబాద్‌లో పడి ఉంటాడు. మీరంతా ఆయన కాళ్లవద్ద పడి ఉంటారు' అని టీడీపీ వర్గీయులనుద్దేశించి అన్నారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో టీడీపీ నాయకులు ఆగ్రహించారు. వేణురెడ్డితో క్షమాపణ చెప్పించేందుకు పురంలోని వైసీపీ కార్యాలయం వద్దకు వెళ్లారు. ఆయన లేకపోవడం, అక్కడున్న వైసీపీ నాయకులు దురుసుగా మాట్లాడటంతో పరిస్థితి అదుపు తప్పి, దాడికి దారితీసింది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని టీడీపీ వర్గీయులను తరిమేశారు. దాడిని వేణురెడ్డి ఖండించారు. టీడీపీ నాయకులు రెచ్చిపోతున్నారని, తమ ప్రభుత్వం వచ్చాక తామేమిటో చూపిస్తామని హెచ్చరించారు. ఎమ్మెల్యే బాలకృష్ణ నియోజకవర్గంలో ఉండి ఇలా చేయించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. దాడిపై వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీచరణ్, మహిళా విభాగం నాయకురాలు మధుమతిరెడ్డి తదితరులు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాడికి సంబంధించిన సీసీ ఫుటేజీని పోలీసులకు ఇచ్చారు.

టీడీపీ నాయకుల నిరసన

రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా హిందూపురానికి ఎమ్మెల్యే బాలకృష్ణ నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తున్నారని, దీన్ని ఓర్వలేక వైసీపీ నాయకులు అలజడి సృష్టిస్తున్నారని టీడీపీ నాయకులు ఆరోపించారు. ఎమ్మెల్యే కార్యాలయం నుంచి అంబేడ్కర్ సర్కిల్ శనివారం రాత్రి వరకు ర్యాలీ నిర్వహించి, బైఠాయించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, మునిసిపల్ ఛైర్మన్ రమేష్, పట్టణాధ్యక్షుడు వెంకటేశ్, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ ఆనంద్, అనీల్, నాగరాజు, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు. ఏడాదిన్నరలోనే నియోజకవర్గానికి రూ.200కోట్లు తెచ్చిన ఘనత బాలకృష్ణదని వారు అన్నారు. వైసీపీ హయాంలో ఒక్క రోడ్డుకూడా వేయలేదని విమర్శించారు. వేణురెడ్డి వెంటనే ఎమ్మెల్యేకు క్షమాపణ చెప్పాలని, లేదంటే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.


అంబేడ్కర్ సర్కిల్‌లో బైఠాయించిన టీడీపీ నాయకులు

నేను.. సత్యసాయిని..!

ఉరవకొండలో సత్యసాయిబాబా అవతార ప్రకటన

పసివయసులోనే మహిమలు చూపిన మహర్షి



ఉరవకొండలోని బాల సాయిబాబా మందిరం

ఉరవకొండ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రపంచానికి ప్రేమతత్వాన్ని బోధించిన సత్యసాయిబాబా ఉరవకొండలో తన అవతార ప్రకటన చేశారు. తల్లిదండ్రులు పెట్టిన సత్యనారాయణరాజు పేరును కాదని, తన 14వ ఏట సత్యసాయిగా ప్రకటించుకున్నారు. సత్యసాయిబాబా 1926, నవంబరు 23న పుట్టపర్తిలో వెంకమరాజు, ఈశ్వరమ్మ దంపతులకు జన్మించారు. బాబా సోదరుడు శేషమరాజు ఉరవకొండలో కరిబసవస్వామి, బోర్డు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పని చేస్తుండటంతో విద్యాభ్యాసం కోసం ఆయన వచ్చాడు. విద్యార్థి దశలోనే అనేక మహిమలను చూపిస్తూ, తనతోటి విద్యార్థులనే కాకుండా, ఉపాధ్యాయులను అబ్బురపరిచేవారు. ఆ సమయంలోనే మౌనంగా ఉండటం, తనకు ఇష్టమైనప్పుడు పాఠశాల సమీపంలోని అబ్కారీ ఇన్‌స్పెక్టర్ బంగ్లా ఆవరణలోని పెద్ద రాతి గుండుపై కూర్చునే వారు. 1940, అక్టోబరు, 20న పాఠశాలకు వెళ్లిన ఆయన తిరిగి ఇంటికి రాగానే చేతిలోని పుస్తకాల సంచిని విసిరేసి, 'మాయ వీడినది, నేను సత్యనారాయణను కాదు, సత్యసాయి బాబాను, నేను నా కర్తవ్యాన్ని నిర్వహించాల్సి ఉంది. నన్ను నా భక్తులు పిలుస్తున్నారు. నేను వెళ్తున్నాను' అంటూ అబ్కారీ ఇన్‌స్పెక్టర్ బంగ్లా ఆవరణకు వెళ్లి కూర్చుండి పోయారు. దీన్ని చూసి శేషమరాజు భార్య ఆశ్చర్యంతో వారించేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. 14 ఏళ్ల బాలుడు ధ్యాన ముద్రలో గుండుపై కూర్చున్నాడని ఉరవకొండ, చుట్టు పక్కల ప్రజలకు తెలిసి అక్కడికి వచ్చారు. ఆ తేజోమూర్తిని చూసిన పిమ్మట భక్తులుగా మారారు. తొలి సారిగా మనసాభజరే గురుచరణం అన్న భజన గీతాన్ని భక్తులతో బాబా





సత్యసాయిబాబా చదివిన తరగతి గది

ఆలపింపజేసినట్లు స్థానికులు నేటికీ చెబుతున్నారు. సత్యనారాయణ రాజు అవతార ప్రకటన విషయాన్ని శేషమరాజు ద్వారా తెలుసుకున్న తల్లిదండ్రులు ఉరవకొండకు చేరుకుని, బాబాను అతికష్టం మీద పుట్టపర్తికి తీసుకెళ్లారు. ఇలా బాబాతో కొన్నేళ్ల అనుబంధాన్ని ఉరవకొండ మూటగట్టుకుంది. అలా బాబా ప్రపంచానికి తెలిసిన తర్వాత 2003లో ఉరవకొండలో సత్యసాయి భజన మందిరాన్ని నిర్మించారు. దీనికి సంబంధించి బాబా చేతుల మీదుగా శిలాఫలకాన్ని ఆవిష్కరింపజేశారు. అలాగే సత్యసాయి బాబా ధ్యానం చేసిన గుండుకు మందిరాన్ని కట్టి , బాల సాయి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ నిత్య పూజలతో పాటు ప్రతి ఏటా అవతార ప్రకటన రోజు రథోత్సవాన్ని నిర్వహిస్తారు. జయంతి వేడుకలను ఆరాధనలను ఘనంగా నిర్వహిస్తున్నారు.



విడదీయరాని బంధం..

సత్యసాయిబాబాకి ఉరవకొండతో విడదీయరాని అనుబంధం ఉంది. ఉరవకొండలోనే అవతార ప్రకటన చేసినా, తల్లిదండ్రుల కోరిక మేరకు పుట్టపర్తికి వెళ్లి ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు. విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యం ఇచ్చారు. మానవతా విలువలతో కూడిన బోధనలు ప్రబోధించారు. అవతార ప్రకటన రోజు ప్రతి ఏటా రథోత్సవం నిర్వహిస్తున్నాం.

- రామాంజనేయులు, సత్యసాయి సమితి కన్వీనర్

ఎన్నో గ్రామాలకు తాగునీరు

సత్యసాయి వాటర్ ప్రాజెక్టు ద్వారా ఎన్నో గ్రామాలకు తాగు నీరు అందించి, శాశ్వత పరిష్కారం చూపారు. సత్యసాయి బాబా అతార ప్రకటన చేసిన రాతిగుండుపై బాల సాయి విగ్రహాన్ని ప్రతిష్ఠించాం. ప్రతి ఏటా సత్యసాయి జయంతికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపడుతున్నాం. సత్యసాయి బాబా చేత శిలాఫలకాన్ని ఆవిష్కరించి భజన మందిరాన్ని నిర్మించాం.

- సాగర్, భక్తుడు



ఏఐ ద్వారా డ్రోన్ సర్వే



ఏఐ సాంకేతికతతో డ్రోన్ సర్వే నిర్వహిస్తున్న శాస్త్రవేత్తల బృందం

లేపాక్షి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలో కర్నూలుకు చెందిన ఐఐఐటీడీఎం ప్రొఫెసర్లు ఏఐ టెక్నాలజీ ద్వారా డ్రోన్ సర్వే చేపట్టారు. ఈ సంస్థ ప్రొఫెసర్లు గత పదేళ్ల వర్షపాతం, వ్యవసాయ సంబంధిత డేటాను విశ్లేషించి, ప్రస్తుత పరిస్థితులతో పోల్చి భవిష్యత్తులో సంభవించే కరువు అవకాశాలను అంచనా వేయడానికి శాస్త్రీయ పరిశోధనలను ప్రారంభించారు. ఈ అధ్యాయనం ఆధునిక డ్రోన్ సాంకేతికత ఆధారంగా నిర్వహిస్తున్నారు. ఈ పరిశోధనలో భాగంగా కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ డాక్టర్ నరేష్‌బాబు ఆధ్వర్యంలో ఈ బృందం లేపాక్షి మండలంలో డ్రోన్ ఆధారిత సర్వే నిర్వహించింది. వ్యవసాయ భూభాగం, నీటి వనరులు పంటల పరిస్థితులు వంటి కీలక అంశాలపై డ్రోన్‌లు సేకరించిన డేటాను కరువు సూచికల విశ్లేషణకు ఉపయోగిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి స్థానిక వ్యవసాయాధికారి శ్రీలత హాజరై వీరికి సహాయ సహకారాలు అందించారు.

సోమందేపల్లి: మండలంలోని గుడిపల్లి, నాగినాయనిపల్లి గ్రామంలో శనివారం కర్నూలుకు చెందిన ఐఐఐటీ డీఎమ్ ప్రొఫెసర్ల బృందం డ్రోన్ సర్వే నిర్వహించింది. ఏఓ విజయభారతి మాట్లాడుతూ ప్రొఫెసర్లు నరేష్‌బాబు, సత్తిబాబు, కృష్ణానాయక్‌ల బృందం శ్రీసత్యసాయి జిల్లాలో మధ్యస్థ కరువు మండలాలను గుర్తించేందుకు పర్యటించినట్లు తెలిపారు. వారు ఆయా గ్రామాల్లో రైతులు సాగుచేసిన పంటలను పరిశీలించి ఏఐ టెక్నాలజీ ద్వారా డ్రోన్లను ఉపయోగించి కరువు పంటల పరిస్థితులను విశదీకరించినట్లు తెలిపారు. కరువు ప్రాంత పంటలను అధ్యాయనం చేయడానికి వచ్చిన బృందం తాము సేకరించిన సమాచారాన్ని ప్రభుత్వానికి నివేదించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ అల్లెఖ్య, వీఐఏ, వీఎస్ఏ, రైతులు పాల్గొన్నారు.

సత్యసాయి సేవలు అమూల్యం



మహాసమాధికి ప్రణమిల్లిన జస్టిస్ బీఆర్ గవాయ్



జస్టిస్ బీఆర్ గవాయ్‌ను సన్మానిస్తున్న రత్నాకర్



సత్యసాయి మహాసమాధికి ప్రణమిల్లిన కేంద్రమంత్రి పీయూష్ గోయల్

(5వ పేజీ తరువాయి)

ప్రేమతత్వంపై సంగీత, గాన కచేరి నిర్వహించారు. అనంతరం విద్యార్థులు భక్తిగీతాలాపన చేశారు.

వెలకట్టలేని సేవలు..

భగవాన్ సత్యసాయి వెలకట్టలేని సేవలతో ఆదర్శంగా నిలిచారని కేంద్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. ఆయన బాటలో పయనించాలని భక్తులకు పిలుపునిచ్చారు. శత జయంతి వేడుకలలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన.. భక్తులనుద్దేశించి ప్రసంగించారు. కరువు ప్రాంత దాహార్తిని తీర్చిన మహనీయుడు సత్యసాయి అని కొనియాడారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ద్వారా 28 వేల గుండె శస్త్ర చికిత్సలు, 37 వేల న్యూరో సర్జరీలు, 18 లక్షల మందికి వైద్య సేవలు అందించారని అన్నారు. ప్రశాంతి నిలయం నిజమైన శాంతి నిలయం అని కొనియాడారు. సత్యసాయి బోధించినట్లుగా ఆయన జీవితమే ఆయన సందేశమని అన్నారు. 2016లో తాను తొలిసారి మహాసమాధిని దర్శించుకున్నానని అన్నారు. సత్యసాయి సేవలను ట్రస్టు మరింత పారదర్శకంగా కొనసాగించడం అభినందనీయమని అన్నారు.

సత్యసాయి అందరివాడు..

సత్యసాయి అందరివాడని, మనవెంటే ఉన్నాడని సత్యసాయి సేవా సంస్థల జాతీయ అధ్యక్షుడు నిమిష్ పాండే అన్నారు. ఒక్క భారత్‌కే గాక ప్రపంచానికి సేవలు, బోధనలు, ప్రేమతత్వాన్ని అందించారని అన్నారు. తాము సత్యసాయి మార్గంలో పయనిస్తూ సేవలందిస్తున్నామని అన్నారు. వేడుకలకు హాజరైన ప్రముఖులను సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ ఘనంగా సన్మానించారు. వేడుకల్లో పాల్గొన్న భక్తులకు నారాయణ సేవ అందించారు. వేలాది మంది భక్తులతో పుట్టపర్తి కళకళలాడింది.

ఏఈఈలకు ప్రమోషన్

అనంతపురం రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా విద్యుత్ శాఖ పరిధిలోని పలువురు ఏఈఈలకు డీఈఈలుగా ఉద్యోగోన్నతి లభించింది. ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురం రూరల్ ఏఈఈగా పనిచేస్తున్న సోమశేఖర్‌కు డీఈఈగా ఉద్యోగోన్నతి కల్పించి కళ్యాణదుర్గంకు బదిలీ చేశారు. ఎంఅండ్‌పీలో ఏఈఈగా పనిచేస్తున్న చంద్రమోహన్‌కు డీఈఈగా కళ్యాణదుర్గం టౌన్‌కు బదిలీ చేశారు. శ్రీసత్యసాయి జిల్లాలో మరో ఇద్దరు ఏఈఈలకు ఉద్యోగోన్నతి కల్పించారు. మదనమోహన్, శీనా నాయక్ డీఈఈలుగా ఉద్యోగోన్నతి పొందారు.

మేనేజ్‌మెంట్ కోటాలో ప్రవేశం

ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాలలో 2025-26 విద్యాసంవత్సరంలో డిగ్రీ ఆ నర్స్ కోర్సుల్లో ప్రవేశానికి కళాశాల హెల్ప్ డెస్కును సంప్రదించాలని కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సరిత తెలిపారు. కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్, బయోటెక్నాలజీ, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, మైక్రోబయాలజీ, జువాలజీ, బీబీఏ, బీబీఎం బిజినెస్ అనలిటిక్స్, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీకాం అకౌంటింగ్ వంటి సబ్జెక్టుల్లో మొదటి సంవత్సరానికి మేనేజ్‌మెంట్ కోటాలో ప్రవేశాలు కల్పిస్తామన్నారు. వివరాలకు 8297531541, 996664 4080 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

తాడోపేడో తేల్చుకుందాం.. రండి..!

శ్రీభాగ్ ఒప్పందంపై కుంచం



బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న కుంచం

అనంతపురం టౌన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): శ్రీభాగ్ ఒప్పందం చరిత్రలో కలుక్కుమంటున్న జ్ఞాపకం అని, ఒప్పందంపై తాడోపేడో తేల్చుకుందామని రాయలసీమ రాష్ట్ర సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కుంచం వెంకట సుబ్బారెడ్డి అన్నారు. పన్నెండు జిల్లాలను కలిపి ప్రత్యేక రాయలసీమ రాష్ట్రం ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌తో కర్నూలు అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం నిర్వహించే రాయలసీమ రాష్ట్ర సమితి సమావేశానికి అన్ని పార్టీల నాయకులు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. నగరంలోని ఆ సమితి జిల్లా కార్యాలయంలో రాష్ట్ర సమితి సమావేశ బ్రోచర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ఎనిమిది దశాబ్దాలలో శ్రీభాగ్ ఒప్పందంలోని ఏ ఒక్క అంశమూ అమలు కాలేదని అన్నారు. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ఉన్నపుడు తెలుగు వాళ్లని తమిళులు వెనక్కు నెట్టేస్తున్నారనే ఆందోళన ఉండేదని అన్నారు. ఆ కారణంగానే ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడాలనే భావన పెరిగిందని అన్నారు. ఇప్పటికైనా రాయలసీమ వాసులు చైతన్యం కావాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రత్యేక రాయలసీమ రాష్ట్ర సాధనకోసం నిర్వహిస్తున్న ఈ సమావేశానికి జిల్లా నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ ఓబుల్‌రెడ్డి, సోమసుందర్ రెడ్డి పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.44

అనంతపురం రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టామోటా గరిష్ఠంగా రూ.44తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. శనివారం మార్కెట్‌కు 2,100 టన్నుల టమోటా కాయలు వచ్చాయన్నారు. టమోటా కిలో కనిష్ఠ ధర రూ.24, సరసరి ధర రూ.30తో విక్రయాలు జరిగాయన్నారు.

దుకాణంలోకి దూసుకెళ్లిన కారు

ముగ్గురికి గాయాలు



దుకాణంలోకి దూసుకెళ్లిన ఇన్నోవా

నంబులపూలకుంట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మల్లికార్జున స్వామి కాంప్లెక్సులో ఉన్న దుకాణాల మీదుగా శనివారం ఓ కారు దూసుకెళ్లడంతో ముగ్గురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు మండలకేంద్రానికి సమీపంలోని ఉన్న సోలార్ ప్రాజెక్టులో పని చేస్తున్న ఓ ఉద్యోగి విధులు ముగించుకుని తన కారును డ్రైవ్ చేసుకుంటూ కదిరికి బయల్దేరాడు. బస్టాండ్ కూడలిలోకి రాగానే కారు అదుపుతప్పి మల్లికార్జునస్వామి కాంప్లెక్సులో ఉన్న రామయ్య, నజీర్, ఖాదర్‌బాషాలకు చెందిన కూరగాయల దుకాణంలోకి దూసుకెళ్లింది. దీంతో కూరగాయల బుట్టలు నుజ్జునుజ్జుకాగా, దుకాణాల ముందు నిలుచుకుని ఉన్న మంజునాథ్, టి. శంకర్, పి.శంకర్ గాయపడ్డారు. మంజునాథ్, టి. శంకర్ ఎన్పీకుంట వాసుకాగా, పి.శంకర్ అన్నమయ్యజిల్లాలోని కొట్టాలకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. అలాగే దుకాణాల వద్ద పార్క్ చేసిన నాలుగు వాహనాలు దెబ్బతిన్నట్లు చెప్పారు. ప్రమాదంలో గాయపడిన వారిని 108 ద్వారా కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటనపై విచారించి, కేసు నమోదు చేస్తామని ఏఎస్ఐ కిషోర్‌రెడ్డి పరిశీలించారు.

కుక్కల దాడిలో ఇద్దరికి గాయాలు

ఓబుళదేవరచెరువు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామిరెడ్డిపల్లి, నారప్పగారిపల్లిలో శనివారం జరిగిన కుక్కలదాడిలో ఇద్దరు గాయపడ్డారు. రామిరెడ్డిపల్లికి చెందిన వృద్ధురాలు మంతముతక మస్తానమ్మ తన వ్యవసాయ పొలానికి వెళ్తుండగా కుక్కలు దాడి చేశాయన్నారు. ఈ దాడిలో ఆమె ఎడమ కాలికి తీవ్ర రక్తగాయాలు కాగా, కుడి చెవికి గాట్లు పడ్డాయి. స్థానికులు ఆమెను కుక్కల దాడి నుంచి కాపాడి108లో కదిరి ఆస్పత్రికి తరలించారు. మరో ఘటనలో కూలి పనుల కోసం నారప్పగారిపల్లికి వచ్చిన వంచిరెడ్డిపల్లికి చెందిన ఆదినారాయణపై కూడా కుక్క దాడి చేసింది. కాలికి తీవ్ర గాయం కావడంతో బాధితుడిని స్థానికులు ఓడీసీ ఆస్పత్రికి తరలించారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి

బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయాకర్‌రెడ్డి

పుట్టపర్తిరూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బీజేపీని సంస్థాగతంగా బలోపేతం చేయడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా బీజేపీ కార్యాలయంలో శనివారం జిల్లా బీజేపీ అధ్యక్షుడు జీఎం శేఖర్ అధ్యక్షతన జిల్లా పదాధికారుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన దయాకర్‌రెడ్డి పార్టీ నిర్మాణం, విస్తరణపై నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు బూత్‌కమిటీలను, శక్తికేంద్రాలు, మండలకమిటీలను త్వరగా ఏర్పాటు చేయాలన్నారు. వీటి ద్వారా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ-అభివృద్ధి పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని కోరారు. కార్యక్రమంలో జాతీయ కౌన్సిల్ సభ్యులు విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లాఇన్చార్జి బాలకృష్ణయాదవ్, సీనియర్ నాయకులు రమేష్‌రెడ్డి, తలుపుల గంగాధర్, జిల్లాప్రధాన కార్యదర్శి హరికృష్ణ, అమరదేవేంద్ర, జ్యోతిప్రసాద్, సురేంద్ర బాబు, కొండమరాజు, పట్టణ అధ్యక్షుడు కళ్యాణ్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయాకర్‌రెడ్డి

రాజకీయం కోసమే విమర్శలు

వైసీపీపై జనసేన నేత చిలకం ధ్వజం



ధర్మవరం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆగిపోయిన వైద్య కళాశాలల నిర్మాణం విషయంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తీరును రాజకీయం చేస్తూ విమర్శలు చేస్తున్నారని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి మండిపడ్డారు. జనసేన పార్టీ కార్యాలయంలో శనివారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ఎక్కడచూసినా మాజీమంత్రి పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి భూబాగోతాలే కనిపిస్తున్నాయన్నారు. వీటిని బయటపెడు తుంటే జీర్ణించుకోలేని కార్యకర్తలు, పెద్దిరెడ్డి అనుచరులు పవన్‌కల్యాణ్, జనసేన పార్టీపై నోరుపారేసుకుంటున్నారని మండిపడ్డారు. పెద్దిరెడ్డి కుటుంబానికి 45.80ఎకరాలు భూమి ఉండేది. వెబ్‌ల్యాండ్‌లో వచ్చేసరికి 77.54ఎకరాలు ఏ విధంగా పెరిగిందని ఆయన ప్రశ్నించారు. 295, 296 సర్వేనెంబర్లలో గతంలో కన్నా ప్రస్తుతం ఏ విధంగా విస్తీర్ణం పెరిగిందని ప్రశ్నించారు. 40ఎకరాలు కబ్జాకు గురైనట్టు అధికారుల సర్వేలో నిర్ధారణ అయిందన్నారు. పెద్దిరెడ్డిలో నిజాయతీ సీబీఐ విచారణ కోరి నిజాయతీని నిరూపించుకోవాలన్నారు. తిరుమలకు సరఫరా చేసిన నెయ్యిలో కల్తీ జరిగినట్లు సిట్ నిర్ధారించినట్లు తెలిపారు. గతంలో తిరుమలలో పని చేసిన ఓ పోలీస్ అధికారి అనుమానాస్పద మృతిపై నిజానిజాలు వెలికితీయాలని డిమాండ్ చేశారు. జగన్‌రెడ్డి వద్ద మెప్పుపొందేందుకు పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి మతి భ్రమించి మాట్లాడుతున్నారని విమర్శించారు. కేతిరెడ్డి, శ్రీధర్‌రెడ్డి ఉనికిని కాపాడుకోవడం కోసమే చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌పై విమర్శలు గుప్పిస్తున్నారన్నారు.

చీనీ టన్ను రూ.18వేలు

అనంతపురంరూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): అనంత వ్యవసాయ మార్కెట్‌లో శనివారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.18వేలుతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపికశ్రేణి కార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. కనిష్ఠంగా రూ.8వేలు, సరాసరి ధర రూ.15వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 25 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు తెలిపారు.

డాక్టర్, టెక్నీషియన్లే సూత్రధారులు

- కిడ్నీ రాకెట్ కేసులో వీడిన మిస్టరీ
- డీసీహెచ్ఎస్ సహా ఆరుగురి అరెస్టు
- 6 సెల్‌ఫోన్లు స్వాధీనం.. డాక్టర్ పరారీ
- మరో ఎనిమిది మంది పాత్ర గుర్తింపు
- 'గ్లోబల్'లో ఒకేరోజు ఇద్దరికి కిడ్నీ మార్పిడి
- విశాఖకు చెందిన మహిళ యమున మృతి
- వివరాలు వెల్లడించిన మదనపల్లె డీఎస్పీ



కిడ్నీ మార్పిడి కేసులో నిందితుల వివరాలు వెల్లడిస్తున్న మదనపల్లె డీఎస్పీ మహేందర్, ఇతర పోలీసులు. చిత్రంలో నిందితులు(ముసుగు)

మదనపల్లె, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా మదనపల్లెలో వెలుగుచూసిన కిడ్నీ రాకెట్ కేసులో మిస్టరీ వీడింది. డయాలసిస్ కేంద్రాల్లో పనిచేసే ఇద్దరు మేనేజర్లు, విశాఖ ప్రాంతానికి చెందిన ఇద్దరు మధ్యవర్తులతో అన్నమయ్య జిల్లా డీసీహెచ్ఎస్, బెంగళూరుకు చెందిన కిడ్నీ మార్పిడి డాక్టర్లు దీనిలో కీలకపాత్ర పోషించినట్లు గుర్తించారు. ఈ క్రమంలో ఆరుగురిని అరెస్టు చేసి వారి నుంచి 6 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మరో ఎనిమిది మంది నిందితులను గుర్తించారు. ఈ కేసులో కీలకంగా మారిన బెంగళూరుకు చెందిన వైద్యుడు పరారీలో ఉన్నారు. ఈ కిడ్నీ రాకెట్ ముఠా కేసుకు సంబంధించిన వివరాలను మదనపల్లె డీఎస్పీ మహేందర్.. శనివారం మీడియాకు వివరించారు.

డబ్బు ఆశ చూపి..

విశాఖపట్నానికి చెందిన ఎస్. యమున(29) ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారు. ఈ విషయాన్ని గ్రహించిన అదే ప్రాంతానికి చెందిన పిల్లి పద్మ, సత్యలు కిడ్నీ ఇస్తే డబ్బులు వస్తాయని ఆశ చూపారు. తాను కూడా ఇప్పటికే కిడ్నీ విక్రయించినట్లు పద్మ తెలిపింది. ఇదే విషయాన్ని యమునతో సహజీవనం చేస్తున్న సూరిబాబుకు కూడా చెప్పారు. ఈ ముగ్గురూ కలసి యమున కిడ్నీ ఇచ్చేలా ఒప్పించారు. అనంతరం.. మదనపల్లె, సత్యసాయి జిల్లా కదిరి డయాలసిస్ కేంద్రాల్లో మేనేజర్లుగా పనిచేస్తున్న బాల రంగడు అలియాస్ బాలు, మోహరాజ్‌లను పద్మ, సత్య సంప్రదించారు. వారి సూచన మేరకు యమునను మదనపల్లెకు తీసుకొచ్చి గ్లోబల్ ఆసుపత్రి యజమాని, డీసీహెచ్ఎస్‌గా పనిచేస్తున్న డాక్టర్ కె. ఆంజనేయులును సంప్రదించారు. ఈ నెల 9న గ్లోబల్ ఆసుపత్రిలో యమునను చేర్చారు. అప్పటికే బెంగళూరు నుంచి వచ్చిన కిడ్నీ ఆపరేషన్ స్పెషలిస్టు, ఇద్దరు సాంకేతిక సిబ్బందితో కలిసి గ్లోబల్ ఆసుపత్రిలో ఒక డోనర్ నుంచి కిడ్నీ తొలగించి, రిసీవర్‌కు ఆపరేషన్ చేశారు. అదే రోజురాత్రి యమున నుంచి కిడ్నీ తొలగించి మరో రిసీవర్‌కు సర్జరీ చేశారు. అంతవరకు బాగానే ఉన్నా.. తర్వాత యమున ఆరోగ్య పరిస్థితి విషమించడంతో పదో తేదీ ఉదయం ఆమె మృతి చెందారు. దీంతో కంగారు పడిన కిడ్నీ ముఠా బృందం యమున మృతదేహాన్ని హుటాహుటిన మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఇక్కడ పోస్టుమార్టానికి సరైన వసతులు లేకపోవడంతో తిరిగి తిరుపతి రుయాకు తరలించి ప్రక్రియ పూర్తిచేసి మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు.

ఇతర రాష్ట్రాలకు బృందాలు

యమున తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. గ్లోబల్ ఆసుపత్రి యజమాని డాక్టర్ కె. ఆంజనేయులు, డయాలసిస్ కేంద్రాల మేనేజర్లు బాలరంగడు, మోహరాజ్, మధ్యవర్తులు పిల్లి పద్మ, సత్య సహా యమున వెంట వచ్చిన సూరిబాబులను అరెస్టు చేశారు. ఆపరేషన్‌లో కీలకంగా వ్యవహరించిన బెంగళూరు వైద్యుడు పరారీలో ఉన్నట్లు డీఎస్పీ పేర్కొన్నారు. ఇదే కేసులో మరో ఎనిమిది నిందితులను గుర్తించామని, వీరిని కూడా త్వరలో అరెస్టు చేస్తామన్నారు. వీరిలో మొదటి రిసీవర్‌కు కిడ్నీ ఇచ్చిన వ్యక్తి, ఇద్దరు కిడ్నీ రిసీవర్లు, బెంగళూరు డాక్టర్‌కు సహకరించిన ఇద్దరు టెక్నీషియన్లు, యమున మృతదేహాన్ని తిరుపతి, మదనపల్లెకు తరలించిన అంబులెన్స్ డ్రైవర్‌తో సహా మరో ఇద్దరిని అరెస్టు చేయాల్సి ఉందన్నారు. ఈ కేసును ఛేదించడానికి 4 ప్రత్యేక బృందాలను నియమించినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. ఈ బృందాలు ఏపీ, గోవా, కర్ణాటక, తెలంగాణలో నిందితులకోసం గాలిస్తున్నట్లు చెప్పారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా కిడ్నీ ఆపరేషన్లు చేస్తున్న ఆసుపత్రిపై మరింత లోతుగా విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని డీఎస్పీ వివరించారు.

న్యూస్ బాక్స్

పది పరీక్షలకు కేంద్రాల పరిశీలన



అమడగూరులో విద్యార్థులకు పరీక్షలపై వివరిస్తున్న విద్యాధికారులు

అమడగూరు/ఓబుళదేవరచెరువు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రమైన అమడగూరులోని పదో తరగతి పరీక్ష కేంద్రాలను ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ లాజర్, పెనుగొండ డివిజన్ డిప్యూటీ డీఈఓ జాన్‌రెడ్డెప్ప శనివారం పరిశీలించారు. మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్, స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌ను పరిశీలించారు. ఈ పరీక్ష కేంద్రాలలో సౌకర్యాలను పరిశీలించారు. కష్టపడి చదివి పదో తరగతి పబ్లిక్ పరీక్షలలో ఉత్తమ మార్కులతో అందరూ ఉత్తీర్ణులు కావాలని విద్యార్థులకు తెలియజేశారు. ఎంఈఓ జిలాన్‌బాషా, జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమణారెడ్డి, ఏపీ మోడల్ స్కూల్ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ బాబా ఫక్రుద్దీన్ పాల్గొన్నారు. అలాగే సహాయ కమిషనర్ లాజర్, డిప్యూటీ డీఈఓ జాన్‌రెడ్డెప్ప ఓబుళదేవరచెరువు మండలంలోని కేజీబీవీతో పాటు జీవన్‌జ్యోతి, విజ్ఞాన్, శ్రీవిజ్ఞాన్, వశిష్ఠ, జడ్పీ ఉన్నత పాఠశాలలో సౌకర్యాలను పరిశీలించారు. ఎంఈఓ రమణ, ప్రధానోపాధ్యాయురాలు శిరీష, గీతాబాయి, కర స్పాం డెంట్లు ఫక్రుద్దీన్, మస్తాన్, శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'పుస్తక పఠనంతో విజ్ఞానాభివృద్ధి'



నంబులపూలకుంట గ్రంథాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

ధర్మవరం/ నంబులపూలకుంట/నల్లచెరువు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పుస్తక పఠనం చేయడం వల్ల విజ్ఞానం పెంపొందుతుందని గ్రంథాలయాధికారి అంజలి సౌభాగ్యవతి పేర్కొన్నారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా రెండో రోజు శనివారం ధర్మవరంశాఖ గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలు మహాలక్ష్మి, కవిత హాజరై పుస్తక పఠనం, గ్రంథాలయాల ప్రాముఖ్యత గురించి వివరించారు. గ్రంథాలయ సిబ్బంది రాము, రమణనాయక్, సరస్వతమ్మ, ముకుంద, గంగాధర్, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే నంబులపూలకుంట లో నిశాఖ గ్రంథాలయంలో స్థానిక జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల విద్యార్థులు హాజరై గ్రంథాలయంలోని పుస్తకాలను చదివారు. గ్రంథాలయ అదికారి ఫరీయాబాను, పాఠకులు పాల్గొన్నారు. నల్లచెరువులోని గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి ప్రసాద్ నాయక్ ఆధ్వ ర్యంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. స్థానిక ఎంపీయూపీ పాఠశాల విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ పుస్తకాల పంపిణీ

ధర్మవరం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఎన్ఎంఎంఎస్ పరీక్ష రాసే విద్యార్థుల కోసం జన విజ్ఞాన వేదిక, యూటీఎఫ్ ఆధ్వర్యంలో ముద్రించిన మెంటల్ ఎబిలిటీ పుస్తకాలను శనివా రం పట్టణంలోని పలు పాఠశాల్లో అందజేశారు. పట్టణంలోని బీఎస్ఆర్ బాలుర, బాలికల పాఠశాలలు, శాంతినగర్, శివానగర్ ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు వాటిని ఉచితంగా అందజేశామని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి, జేవీవీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి రామకృష్ణనాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జేవీవీ జిల్లా కార్యదర్శి లోకేశ్, యూటీఎఫ్ నాయకులు నాగిరెడ్డి, రామాంజినేయులు, సాయిగణేశ్, నాగేంద్రమ్మ పాల్గొన్నారు.

ఘనంగా బిర్సాముండా జయంతి



సమావేశంలో మాట్లాడుతున్న డీసీడబ్ల్యూఓ మోహన్‌రావు

తనకల్లు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని సీజీ ప్రాజెక్టు వద్ద ఉన్న గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో శనివారం గిరిజన యోధుడు బిర్సాముండా 150వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. ఆయన ఆశయ సాధనకు కట్టుబడి ఉన్నామని, ఆయన ఆశయాలు సాధిస్తామని జిల్లా గిరిజన సంక్షేమాధి కారి(డీసీడబ్ల్యూఓ) మోహన్‌రావు తెలిపారు. గిరిజన నాయకులు కాలేనాయక్, తిబ్రేనాయక్, ప్రిన్సిపల్ మేరీమార్గెంట్, ఉపాధ్యాయులు పారేసునాయక్, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిపై అవగాహన

ఓబుళదేవరచెరువు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కుష్ఠు వ్యాధి కేవలం ఆరోగ్య సమస్య మాత్రమే కాదని, సామాజిక సమస్య కూడా అని ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ బాను ప్రకాష్‌నాయక్, డాక్టర్ కమల్ రోహిత్ పేర్కొన్నారు. మండలకేంద్రంలో శనివారం కుష్ఠువ్యాధి నివారణపై ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలకు వారు అగాహన కార్యక్రమాన్నిఏర్పాటు చేశారు. ఈ నెల 17 నుంచి 30 వరకు 14 రోజులు పాటు ఆశా, ఆరోగ్య కార్యకర్తలు ఇం టింటా సర్వే చేపట్టాలని తెలియజేశారు. అంతకుమునుపు కుష్ఠువ్యాధి నివారణపై వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది ప్రమీల, దిల్‌షాద్, రామకృష్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇలా ఉంటే ఎలా?

తనకల్లు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గౌళ్లపల్లికి విద్యుత్ అధికారులు ఎన్నో యేళ్లక్రితమే విద్యుత్ సౌకర్యం కల్పించారు. గ్రామంలోకి మూడు వైర్లతో విద్యుత్ సరఫరా అందిస్తున్నారు. అయితే గ్రామం సమీపంలో ఆ మూడు విద్యుత్ వైర్లకు పచ్చని తీగలు పూర్తిగా అల్లుకుపోయాయి. వైర్ల మొత్తం కిందికి లాగేస్తున్నాయి. అయినా విద్యుత్ అధికారులు ఆ వైపు కన్నెతి చూసిన పాపాన పోలేదు. దీంతో అటువైపు వెళ్లే గ్రామస్థుల దీనిని చూసి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ వైర్లు ఎక్కడ జాయింట్ అయి విద్యుత్ ప్రమాదాలు ఏర్పడతాయో అని భయాందోళన చెం దుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు గ్రామాన్ని సందర్శించి ఆ విద్యుత్ వైర్లకు అల్లుకున్న తీగలను తొలగించాలని, విద్యుత్ ప్రమాదాలు జరగకుండా నివారించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



విద్యుత్ వైర్లకు అలుకున్న పచ్చని తీగలు

రాత్రికి రాత్రే అక్రమ లే అవుట్లు

● పట్టించుకోని అధికారులు ● ఎమ్మెల్యే ఆదేశాలు బేఖాతరు



సున్నపుగుట్టతండా సమీపంలో లే అవుట్

కదిరి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): రూరల్ పరిధిలోని సున్నపుగుట్ట తండాలో రాత్రికి రాత్రే అక్రమ లేఅవుట్లు వెలుస్తున్నాయి. జాతీయ రహదారికి సమీపంలో శనివారం ఉదయానికే అక్రమ లేఅవు ట్ సిద్ధమైంది. ఎటువంటి అనుమతులు లేకుండానే రాళ్లు పాతి, ప్లాట్లు వేశారు. అనధికారికంగా అగ్రిమెంట్లపై అమ్మకాలు కూడా జరిగినట్లు సమాచారం. అక్రమ లేఅవుట్లను అనుమతించవద్దని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అధికారులను హెచ్చరిస్తున్నారు. అయినా సున్నపుగుట్టతండాలో అక్రమ లేఅవుట్‌పై అధికారుల చర్యలు శూన్యం. తూతూమంత్రంగా శనివారం అధికారులు అలా వచ్చి ఇలా పరిశీలించి, సత్యసాయిబాబా జయంతి పనులున్నాయంటూ అక్కడినుంచి వెళ్లి పోయారు. కదరి రూరల్ పరిధిలోని కుమ్మరవాండ్లపల్లి పంచాయతీలో ఉన్న సున్నపు గుట్టతండా సమీపం లో హైవేకి పక్కనే దాదాపు రెండు ఎకరాల్లో అక్రమ లేఅవుట్లు వెలిశా యి. గత రెండురోజుల నుంచి అక్కడ చదును చేసే పనులు జరుగగా శనివారం ఉదయానికల్లా ప్లాట్లలో నాటిన రాళ్లు కనిపించాయి. ప్రస్తుతానికి అక్కడ సెంటు రూ. 13లక్షల నుంచి 15లక్షలతో ప్లాట్లు వేసి అమ్మినట్లు సమాచారం. ఇప్పటికే పేపర్ లేఅవుట్లలో వీటి అమ్మకాలు మొత్తం జరిగినట్లు తెలిసింది. చివరగా ప్లాట్లు కొనుగోలు చేసిన యజమానులకు ప్లాట్లు చూపించేందుకు ఆ భూమిలో రాళ్లు పాతి ప్లాట్లు విభజించారు. వీటిని ఆయా స్థల యజమానులకు కూడా చూపించినట్లు తెలిసింది. అక్రమ లేఅవుట్లతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది. అక్రమ లేఅవుట్లలో భవనాలు నిర్మిస్తే వాటికి రోడ్లు, కాలువలు, తాగునీరు తదితర స్థానిక సమస్యలు భరించాల్సి ఉంటుంది. అక్రమ లేఅవుట్లు వేసిన యజమానులు మాత్రం స్థలం కొనుగోలు చేసివారికి కేవలం పేపర్ మీదే ప్లాట్లు చూపించి అమ్మివేసి, సొమ్ముచేసుకుంటున్నారు. సున్నపుగుట్టతండాలో ఏర్పాటైన ఈ అక్రమ లేఅవుట్‌పై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అక్రమ లే అవుట్లను అనుమతించం

● ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

నియోజకవర్గ వ్యాప్తంగా అక్రమ లేఅవుట్లను అనుమతించేదిలేదు. మేము అధికారంలోకి వచ్చినప్పుడే మున్సిపాలిటీలో సమావేశాలు పెట్టి అందరికీ తెలిపాం. అక్రమ లేఅవుట్ల వల్ల మున్సిపాలిటీ ఆదాయనికి గండిపడటంతో పాటు, సౌకర్యాల కల్పనకు భారం ఏర్పడుతుంది. సున్నపుగుట్టతండాలో వేసిన అక్రమ లేఅవుట్ మా దృష్టికి వచ్చింది. దీనిపైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించాం.

అక్రమ లే అవుట్లపై చర్యలు తీసుకుంటాం

సున్నపుగుట్టండాలో వెలసిన అక్రమ లేఅవుట్‌పై చర్యలు తీసుకుంటాం. సిబ్బంది అంతా సత్యసాయిబాబా జయంతి పనుల్లో ఉండడం వల్ల చర్యలు ఆలస్యమవుతున్నాయి.

- పంచాయతీ కార్యదర్శి, ఆశాకిరణ్





సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి స్వాగతం పలుకుతున్న కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎస్పీ సతీష్‌కుమార్, జిల్లా కోర్టు న్యాయాధికారి భీమారావు

సీజేఐకి ఘన స్వాగతం

పుట్టపర్తి రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి):సత్యసాయిబాబా శతజ యంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు పుట్టపర్తి విమానాశ్రయానికి వచ్చిన సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌కి ఘనస్వాగతం లభించింది. జిల్లా కోర్టు న్యాయాధికారి భీమారావు, కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎస్పీ సతీష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్ సీజేఐకి పుష్పగుచ్ఛాలు అందచేసి ఘనస్వాగతం పలికారు. అనంతరం సీజేఐ సత్యసాయిబాబా మహాసమాధిని దర్శించుకోవడానికి ప్రశాంతి నిలయం బయలుదేరి వెళ్లారు.




కేంద్ర మంత్రి పియూష్ గోయల్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ శ్యాంప్రసాద్, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి

కేంద్ర మంత్రికి...

సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు పుట్టపర్తి విమానాశ్రయానికి వచ్చిన కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖామంత్రి పియూష్‌గోయల్‌కు ఘనస్వాగతం లభించింది. సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్, కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎస్పీ సతీష్‌కుమార్, మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్, బీజేపీ నాయ కులు విష్ణువర్ధన్‌రెడ్డి, పుష్పగుచ్ఛాలు అందజేసి ఆయనకు ఘన స్వాగతం పలికారు, వీరితోపాటు ఆర్డీఓ సువర్ణ, అధికారులు, ప్రజాప్రతినిధు లు ఉన్నారు. అనంతరం ఆయన సత్యసాయిబాబా మహాసమాధిని దర్శించుకోవడానికి ప్రశాంతి నిలయం బయలుదేరి వెళ్లారు.

కూటమి పాలనతోనే మైనార్టీల అభివృద్ధి

● పరిటాల శ్రీరామ్



సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పరిటాలశ్రీరామ్

ధర్మవరం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ముస్లిం మైనార్టీలకు మంచి చేసింది, చేసేది కూటమి ప్రభుత్వమేనని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇమామ్, మౌజన్‌లకు వేతనాలు చెల్లించడంతో ఆయన శనివారం అనంతపు రంలోని క్యాంపు కార్యాలయంలో ధర్మవరం ముస్లింలతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షు డు పరిశే సుధాకర్, నాయకులు మాధవరెడ్డి, చట్టా లక్ష్మీనారాయణ, గవ్వల నారాయణస్వామి, ముస్లిం నాయకులు నాగూర్‌హుస్సేన్, రాళ్లపల్లి షరీఫ్, రాళ్లపల్లి బాబు, అస్లాం, రావులచెరువు కుళ్లాయప్ప, షామీర్, ఆజాద్, మాబు పాల్గొన్నారు. అలాగే కూటమి ప్రభుత్వం అందించే ప్రభుత్వ పథకాలను దూదేకులకు అందేలా చూడాలని నూర్‌బాషా దూదేకుల సంఘం రాష్ట్ర కార్పొ రేషన్ డైరెక్టర్ రాళ్లపల్లి షరీఫ్‌కు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ సూచిం చారు. నూర్‌బాషా దూదేకుల సంఘం రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఇటీవల ప్రమాణ స్వీకారం చేసిన తరువాత ధర్మవరానికి చెందిన రాళ్లపల్లి షరీఫ్ ముస్లింలతో కలిసి పరిటాల శ్రీరామ్‌ను అనంతపురంలోని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి గజమాలతో సత్కరించారు. దూదేకుల్లో చాలా మందిపేదలున్నారని, అలాంటి వారిని గుర్తించి వారికి ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు అందేలా చూడాలని రాళ్లపల్లి షరీఫ్‌కు శ్రీరామ్ సూచించారు. దూదేకుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు తన వంతు కృషిస్తానని షరీఫ్ తెలియజేశారు.

అయ్యప్ప మాలధారులకు భిక్ష ప్రారంభం

బత్తలపల్లి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని అయప్పస్వామి అలయంలో శనివారం అయ్యప్ప మాలధారులకు భిక్ష కార్యక్రమాన్ని అలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ప్రారంభించారు. దాతల సహకారంతో ప్రతి రోజూ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని వారు తెలిపారు. తొలి రోజు మధ్యాహ్నం జక్కంపూటి పురుషోత్తం చౌదరి, రాత్రి మంజుల నాగేష్ భిక్ష అందజేశారు. గురుస్వామి శెట్టప్పస్వామి, జక్కంపూటి సత్యనారాయణ, ప్రతాప్, రంగానాయుడు, ఆది, ఓబుళనాయుడు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

చెత్తకు నిప్పు - పొగతో ఇబ్బందులు



చెత్తకు నిప్పు పెట్టడంతో వెలువడుతున్న పొగ

గాండ్లపెంట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని నివాస గృహాల వద్ద ఉన్న వ్యర్థాల చెత్తకు ఎవరో నిప్పు పెట్టారు. అయిఏ ఆ చెత్త నుంచి దుర్గంధం, కలుషిత వాయువులతో కూడిన పొగ వెలువడుతోందని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. గాండపెంటలో నిత్యం స్వచ్ఛతా రాయబారులు వీధులలో శుభ్రం చేసి చెత్త, ప్లాస్టిక్, చెప్పులు, పేపర్లు వంటి వ్యర్థాలను ఊరి బయట ఉన్న చెరువు పక్కన దారి వెంబడి వెస్తున్నారు. ఈ వ్యర్థాల చెత్తకుప్పలకు ఎవరో నిప్పు పెట్టారు. దీంతో వాటి నుంచి దుర్గంధం, కలుషిత వాయువులతో కూడిన పొగ వెలువడుతోందని వాటి పక్కనే నివాసం ఉంటున్న ప్రజలు అంటున్నారు. ఆ పొగ దుర్గంధం, ఘాటు భరించలేకపోతున్నామని వాపోతున్నారు. ఆ పొగ పీల్చితే రోగాల బారిన పడే అవకాశాలు అధికంగా ఉన్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ఆ చెరువు దారి వెంబడి ప్రజలు, పాదచారులు వెళ్తుంటారు. దీనిపై పంచాయతీ అధికారులు తక్షణం స్పందించి, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్థులు కోరుతున్నారు.

రైతుల శ్రేయస్సుకు కృషి

● సహకార వారోత్సవాల్లో చైర్మన్

నల్లచెరువు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతుల శ్రేయస్సు కోసం నిరంతరం కృషి చేస్తామని నల్లచెరువు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ కమ్మల వెంకటరమణ అన్నారు. మండలకేంద్రంలోని ఆ సంఘం కార్యాలయం ఆవరణంలో శనివారం సహకార వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. సొసైటీ చైర్మన్ కమ్మల వెంకటరమణ సహకార జెండాను ఆవిష్కరించారు. డైరెక్టర్లు గంగులప్ప, అంజనప్ప, సీఈఓ మల్లికార్జున, మేనేజర్ శ్రీనివాసులు, సి బ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

●తనకల్లు: మండలకేంద్రంలోని పెద్దకడపలవారిపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో శనివారం సహకార ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మొదట సహకార సంఘం జెండాను ఆవిష్కరించారు. సహకార సంఘం అభివృద్ధి తదితర విషయాలను పలువురు వివరించారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ సహాయ అధికారి జనార్దన్, బ్యాంక్ మేనేజర్ గోపాల్, సూపర్‌వైజర్ మల్లికార్జున, షఫీ, సీఈఓ సుధాకరాచారి, మణికంఠ, చైర్మన్ బడా రాజారెడ్డి, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.



నల్లచెరువులో జెండా ఆవిష్కరిస్తున్న చైర్మన్ వెంకటరమణ



పీకేడీపల్లి సొసైటీ కార్యాలయంలో డివిజనల్ సహాయ అధికారి

పరిశుభ్రమైన
సమాజాన్ని నిర్మిద్దాం: కలెక్టర్



విద్యార్థినులతో కలిసి ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ శ్యాంప్రసాద్

పుట్టపర్తిరూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పరిశుభ్రమైన సమాజం నిర్మాణం కోసం ప్రతిపౌరుడు బాధ్యత తీసుకోవాల్సిన అవసర ముందని కలెక్టర్ ఎ. శ్యాంప్రసాద్ పిలుపునిచ్చారు. ప్రతినెల మూడో శనివారం నిర్వహించే స్వచ్ఛాంధ్ర-- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలపరిధిలోని జగరాజుపల్లి కేజీబీవీని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలను పరిశీలించి, పాఠశాలలో చేపడుతున్న పరిశుభ్రత చర్యల గురించి తెలుసుకున్నారు. విద్యార్థినుల హాస్టళ్లను సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతను తప్పనిసరిగా అలవరచుకోవాలని తెలియజేశారు. చేతుల పరిశుభ్రతపై డెమో నిర్వహించారు. వ్యక్తిగత పరిశుభ్రతలో చేతుల పరిశుభ్రత అత్యంత ముఖ్యమని సూచించారు. అనంతరం వ్యక్తిగత పరిశుభ్రతపై చేసిన ప్రతిజ్ఞలో విద్యార్థినులతో పాటు పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి సమత, డీఈఓ కిష్టప్ప, ఎంఈఓ, కేజీబీవీ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులను పరిశీలించిన కలెక్టర్

పుట్టపర్తి టౌన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శతజయంతి సందర్భంగా పుట్టపర్తికి ప్రతిరోజు లక్షమంది వరకు భక్తులు, ప్రజలు వస్తున్నారు. దీంతో పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా ఉండడం కోసం శనివారం రాత్రి 9.30 గంటలకు స్థానిక సత్యమ్మ గుడి సమీపంలో పారిశుధ్య పనులను కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. మరుగుదొడ్లు, పరిసరాల పరిశుభ్రత అంశాలను తనిఖీ చేసిన కలెక్టర్ అక్కడ చేస్తున్న కార్మికులకు, మున్సిపల్ కమిషనర్ క్రాంతికుమార్‌కు పలు సూచనలు, సలహాలు చేశారు. మరింత మెరుగైన పారిశుధ్యం పాటించాలని, ఎక్కడా ఎటువంటి లోటుపాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లు పక్కాగా పూర్తి చేయాలని సూచించారు. అవసరమైతే జిల్లాలోని ఇతర ప్రాంతాల నుంచి పారిశుధ్య కార్మికులను పుట్టపర్తికి తరలించాలని కలెక్టర్ ఆదేశించారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

● ఎమ్మెల్యే కందికుంట



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కదిరి అర్బన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. ఆయన శనివారం స్థానిక కేజీబీవీలో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర -స్వర్ణాంధ్ర కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులకు పరిశుభ్రత గురించి వివరించి, ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలోనే పరిశుభ్రమైన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతినెలా మూడో శనివారం స్వచ్ఛత కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. స్వచ్ఛాంధ్ర మిషన్ డైరెక్టర్ పర్వీన్ బాను, మున్సి పల్ చైర్ పర్సన్ దిల్షాద్ ఉన్నీసా, టీడీపీ నాయకులు రాజశేఖర్ ఆచారి, డైమండ్ ఇర్ఫాన్, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● ధర్మవరం: ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే ఆరోగ్యంగా ఉండగలుగుతారని కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. స్థానిక గుట్టకిందపల్లి వద్ద ఉన్న కేహెచ్‌ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్ గోపాల్‌నాయక్ ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ చిట్టెమ్మ, అధ్యాపకులు గోపాల్‌నాయక్, కిరణ్‌కుమార్, త్రివేణి, పావని, భువనేశ్వరి, హైమావతి, సరస్వతి, ఆనంద్, మీనా, ధనుంజయ పాల్గొన్నారు.

● నల్లమాడ: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణంలో శనివారం ఎంపీడీఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం చేపట్టారు. ఎంపీడీఓ కార్యాలయం సిబ్బంది, ఉపాధి సిబ్బంది పాల్గొని శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ హరినాథరెడ్డి, పంచాయతీకార్యదర్శి దాదాసాబ్, ఫీల్డు అసిస్టెంట్లు, ఆనిమేటర్లు, టీడీపీ నాయకులు బుట్టి నాగభూషణంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను
విమర్శించే స్థాయి మీకు లేదు

● వైసీపీ నాయకులపై బీజేపీ నాయకుల ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ ధర్మవరం నాయకులు

ధర్మవరం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను విమర్శించేస్థాయి వైసీపీ నాయకులకు లేదని బీజేపీ నాయకులు విమర్శించారు. ఎన్డీఏ స్థానిక కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరులసమావేశంలో వారు మాట్లాడుతూ... మంత్రిసత్యకుమార్, బీజేపీ నాయకుడు హరీశ్‌బాబులు జీవితంలో అవినీతి చేయలేదన్నారు. వారిపై చేసిన ఆరోపణలకు ఆధారాలు చూపే దమ్ము వైసీపీ నాయకులకు ఉంటే నిరూపించగలరా అని ప్రశ్నించారు. వైసీపీలో కొత్త భిక్షగాళ్లు కొందరు మంత్రి సత్యకుమార్, హరీశ్‌బాబుపై విమర్శలుచేస్తే ఇకపై సహించేదిలేదన్నారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు బిల్లే శ్రీనివాసులు, పోతుకుంట రాజు, పోతులనాగేపల్లి లక్ష్మీనారాయణ, రమేశ్, నారప్ప, రాదమ్మ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

● ముదిగుబ్బ: కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ధర్మవరం అభివృద్ధి చూసి ఓర్వలేకనే మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి మంత్రి సత్యకుమార్ యాదవ్‌పై విమర్శలు చేస్తున్నారనిఎంపీపీ ఆదినారాయణ యాదవ్ మండిపడ్డారు. మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ... అభివృద్ధి కోసం మంత్రి కృషి చేస్తుంటే ఆయనపై కేతిరెడ్డి విమర్శలు చేయడం సరికాదన్నారు. ఇలాంటి అసత్య ఆరోపణలు మానుకోవాలని హితవు పలికారు. అనంతరం బీహార్‌లో బీజేపీ గెలుపొందిన సం దర్భంగా కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. బీజేపీ నాయకులు ఫణీంద్ర గౌడ్, నాగభూషణ, కుళ్లాయప్ప, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో కార్తీకమాస పూజలు





విశేష అలంకరణలో మిట్టబండ ఆంజనేయస్వామి, వెంకటేశ్వరుడు

మడకశిరటౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసాన్ని పురస్కరించుకొని పట్టణంలోని దేవాలయాల్లో విశేష పూజలు, అర్చనలు, అభిషేకాలు ఘనంగా జరిగాయి. శనివారం మిట్టబండ అంజనేయస్వామి, అభయ అంజనేయస్వామి, కోట వెంకటేశ్వరస్వామితోపాటు పలు ఆలయాల్లో ఉదయం నుంచి విశేష పూజా కార్యక్రమాలను చేపట్టారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంచిపెట్టారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివార్లను దర్శించుకున్నారు.

గుడిబండ, (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొంకల్లు కురబరపల్లి, బీటీపల్లి, హిరేతుర్పి, ఎస్‌రాయాపురం తదితర గ్రామాల్లో వెలసిన అంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు కార్తీక శనివారం ఘనంగా పూజలు నిర్వహించారు. అంజనేయస్వామి విగ్రహానికి ప్రత్యేక పూలతో అలంకరించి ఆకుపూజ, అభిషేకం, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేపట్టారు.

మొక్కజొన్న దళారుల పాలు

కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయని ప్రభుత్వం

దిక్కుతోచని స్థితిలో అమ్ముకుంటున్న రైతులు

సోమందేపల్లి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలో రైతులు సాగుచేసిన మొక్కజొన్న పంట గత్యంతరం లేక దళారులకు అమ్ముకుంటున్నారు. ప్రభుత్వం క్వింటాల్ మొక్కజొన్న రూ.2400 మద్దతు ధరతో రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తామని ప్రకటనలు గుప్పించి నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఆచరణలో నోచుకోకపోవడంతో మొక్కజొన్న రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. తొలగించిన పంటను ఏం చేయాలో తెలియక మార్కెట్‌కు తరలించేందుకు సరైన ధరలు లేక పంట పొలాలవద్దే దళారులకు అందినకాటికి అమ్ముకుంటున్నారు. క్వింటాల్ రూ.1600, రూ.1700తో దళారులు కొనుగోలు చేస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట దిగుబడులు బాగున్నా తీరా పంట చేతికొచ్చిన పరిస్థితిలో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో నష్టపోతున్నామని వారు వాపోతున్నారు. మండల వ్యాప్తంగా ఖరీఫ్‌లో 2743ఎకరాల్లో రైతులు మొక్కజొన్న పంటను సాగుచేశారు. అక్టోబరులోనే కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు వ్యవసాయాధికారి విజయభారతి తెలిపారు. మండలంలో 16 పంచాయతీలుండగా 14 ఆర్బీకేలున్నాయి. అన్ని ప్రాంతాల్లో మొక్కజొన్న సాగుచేశారు. ఒక్కో ఎకరానికి 25నుంచి 30క్వింటాళ్లదాకా దిగుబడి వచ్చింది. ప్రభుత్వం ప్రకటనతో రైతుల పెట్టుబడుల ఖర్చులుపోను కష్టానికి తగ్గ ఫలితం లభిస్తుందని ఆశించారు. అయితే వారి ఆశలు అడియాశలయ్యాయి. ముందునుయ్యి వెనుక గొయ్యి అన్నచందంగా మొక్కజొన్న రైతుల పరిస్థితి తయారైంది. ఇప్పటికే మండల వ్యాప్తంగా 90శాతానికి పైగా రైతులు పంటలను తొలిగించేశారు. మార్కెట్‌లో ధరలు లేకపోవడం, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం రైతుల పాలిట శాపంగా మారింది. ఇదే అదునుగా భావించిన దళారులు రైతులను నిలువునా ముంచేస్తున్నారు. వారుచెప్పిన ధరలకే మొక్కజొన్నను అమ్ముకునే పరిస్థితి ఏర్పడింది. రైతులను దళారులు దోపిడిచేసి సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. తామేమి చేయలేమని పైనుండి ఆదేశాలు వచ్చేవరకు ఎలాంటి చర్యలు తీసుకునే అధికారం తమకు లేదని వ్యవసాయశాఖ అధికారులు అంటున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి మద్దతు ధరతో మొక్కజొన్నను కొనుగోలుచేసి రైతులను ఆదుకోవాలని కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.



మొక్కజొన్న పంటను రోడ్డుపై ఆరబోసిన రైతులు

విద్యార్థులకు నాణ్యమైన భోజనం ఇవ్వాలి

లేనిపక్షంలో ఏజెన్సీని తొలగిస్తాం: ఎంఈఓ ప్రతాప్‌రెడ్డి



చర్చిస్తున్న అధికారులు

గుడిబండ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు నాణ్యత పాటించి వండి వడ్డించకపోతే ఏజెన్సీని తొలగిస్తామని ఎంఈఓ ప్రతాప్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం ఆయనతోపాటు డిప్యూటీ ఎంపీడీఓ నాగరాజు నాయక్, డీటీ రాంభూపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ తదితరులు ఏజెన్సీ నిర్వాహకులతో సమావేశమై చర్చించారు. కళాశాల విద్యార్థులు శుక్రవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. స్పందించిన అధికారులు శనివారం ఏజెన్సీ నిర్వాహకులతో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాన్ని వండి వడ్డించాలని ఆదేశించారు. నాణ్యత పాటించకపోతే ఏజెన్సీని తొలగించి కొత్త ఏజెన్సీని నియమిస్తామని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అవసరం: ఎంపీడీఓ

గోరంట్ల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ కమలాబాయి, ఎంఈఓ గోపాల్ సూచించారు. శనివారం గోరంట్లలో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా అధికారులు విద్యార్థులకు పలు సూచనలు చేశారు. తడి, పొడి చెత్తవల్ల వర్మీకంపోస్టు ఎరువు తయారు చేయవచ్చన్నారు. అనంతరం పంచాయతీ కార్యాలయం, కల్లితండాలోని వీరజవాన్ మురళీనాయక్ ఘాట్ వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మాలతి, టీడీపీ నాయకులు నిమ్మల శ్రీధర్, నాగరాజు, సంతోష్, సురేష్, సర్పంచ్ వాసు నాయక్, వీరజవాన్ కుటుంబ సభ్యులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రతను పాటించండి: ప్రిన్సిపాల్

పెనుకొండ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాలకు సంబంధించిన శుభ్రతను పాటించాలని కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్ సూచించారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా పరిశుభ్రతపై కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే పరిశుభ్రతపై అవగాహన కలిగివుండాలన్నారు. సమాజ పరిశుభ్రత అంటే ఇంటి ముందు చెత్త వేయరాదన్నారు. చెత్తను వేరుచేసి తడిచెత్త, పొడిచెత్తగా విభజించి మునిసిపాలిటీ వారికి అందజేయాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు బషీర్‌అహ్మద్, ఎన్‌ఎస్‌ఎస్ పీఓ శ్రీలేఖ, శివన్న, రవికుమార్, జయప్రకాశ్, రామచంద్రయ్య, ఎన్‌ఎస్ రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు రొద్దకాంబ ఆలయంలో..

రొద్దం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): రొద్దకాంబదేవి ఆలయ జీర్ణోద్ధరణలో భాగంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ట్రస్టు సభ్యుడు వేణుగోపాల్ శనివారం విడుదలచేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటలకు గర్భగుడి ముఖద్వారం, అంతరాల ముఖద్వారాలను ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

పురానికి చేరుకున్న బాలకృష్ణ



మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలకృష్ణ

హిందూపురం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మూడు రోజుల పర్యటనలో భాగంగా స్థానిక శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ శనివారం రాత్రి హిందూపురానికి చేరుకున్నారు. సాయంత్రం చిలమత్తూరు మండలం కొడికొండవద్ద అధికారులతో సమావేశం జరిపారు. అనంతరం హిందూపురంలోని ఎమ్మెల్యే కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. ఆదివారం హిందూపురం పట్టణంలో వాల్మీకి ఆలయ సందర్శన, కనకదాస వేడుకల్లో పాల్గొంటారు. రూ.92.5కోట్లు పనులకు పైలాన్ ఆవిష్కరిస్తారు. ముద్దిరెడ్డిపల్లిలో రాయితీ చేనేత పరికరాలను అందజేస్తారు. సోమందేపల్లిలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణను ప్రారంభిస్తారు.

నేడు కనకదాస జయంతి

వేడుకల్లో పాల్గొననున్న ఎమ్మెల్యే

హిందూపురం, : కురుబల ఆరాధ్యదైవం కనకదాస జయంతి కార్యక్రమం ఆదివారం హిందూపురంలో ఘనంగా జరగనుంది. జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని రైల్వేరోడ్డులో బెంగళూరు నుంచి ప్రత్యేకంగా తెప్పించిన విద్యుత్ దీపాలు అలంకరించారు. ఆదివారం ఉదయం పాండురంగనగర్‌లోని కనకదాస కల్యాణమండపం నుంచి కురుబలు వేలాదిగా ఆర్టీసీ బస్టాండు వద్ద ఉన్న కనకదాస విగ్రహం వరకు ర్యాలీగా వస్తారు. అక్కడ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణతో కలిసి వేడుకలు చేసుకోనున్నారు. ఈ సందర్భంగా అప్పట్లో కనకదాస విగ్రహం ఏర్పాటుకు సహకరించిన ఎమ్మెల్యే బాలకృష్ణను సత్కరిస్తారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తారు.

సోమందేపల్లి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆదివారం రానున్నట్లు స్థానిక టీడీపీ నాయకులు నీరుగంటి చంద్ర తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ మంత్రి సవిత ఆధ్వర్యంలో కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు, కన్వీనర్ వెంకటేశులు, సిద్ధలింగప్ప, సూరీ, ఆకుల రమణ, సూర్యనారాయణ, మద్దిలేటి, గట్టు మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో కనకదాస విగ్రహం

డాక్టర్లు రాని శిబిరాలు ఎందుకు..?

తూతూమంత్రంగా సిబ్బంది చికిత్సలు

గుడిబండ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ప్రభుత్వం మెరుగైన వైద్యం అందించాలని నేపథ్యంలో 104వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. అయితే శనివారం గుడిబండ మండలం దిన్నేహట్టి గ్రామంలో 104వైద్య సిబ్బంది శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరానికి బీపీ, షుగర్, థైరాయిడ్, జ్వరం, కీళ్ల నొప్పులు తదితర వ్యాధులకు సంబంధించి చికిత్సలకు ప్రజలు వచ్చారు. అయితే ఈ శిబిరానికి డాక్టర్ లేకపోవడంతో సిబ్బంది హాజరయ్యారు. రోగులకు తూతూమంత్రంగా వైద్య చికిత్సలు అందించారు. డాక్టర్లులేని వైద్యశిబిరాన్ని ఎందుకు నిర్వహిస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారుల స్పందించ 104 వైద్య శిబిరాన్ని వైద్యులను నియమించి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రజలు కోరుతున్నారు.





పాదయాత్రగా తిరుమలకు..

సోమందేపల్లి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నుంచి శనివారం తిరుపతికి 300మంది భక్తులు బయలుదేరారు. మొదట పాతూరులో వెలసిన వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం పాదయాత్రను ప్రారంభించారు. 9 రోజుల పాదయాత్ర ద్వారా తిరుమలకు చేరుకుని స్వామివారిని దర్శనం చేసుకున్న అనంతరం తిరిగి రానున్నారు. కార్యక్రమంలో వైద్యులు ఓంకార్, నిమ్మకాయల పరంధామ పాల్గొన్నారు.

హిందూపురం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): హిందూపురం నుంచి తిరుమలకు పాదయాత్ర బృందం బయలుదేరింది. పట్టణంలోని బాలాజీనగర్‌లో ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి 522 మంది భక్తులు కాలినడకతో తిరుమలకు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ రమేష్ జెండా ఊపి పాదయాత్రను ప్రారంభించారు. కార్యక్రమంలో పాదయాత్రబృందం అధ్యక్షులు పురుషోత్తంరెడ్డి, ఆలయ చైర్మన సుబ్బు, భగీరథ నవీన్, సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ వినియోగంపై అవగాహన అవసరం

అగళి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): డ్రోన్ల వినియోగంపై రైతులు అవగాహన కలిగివుండాలని వ్యవసాయశాఖ అధికారి నాగరాజు అన్నారు. డ్రోన్ వినియోగంపై రైతులకు ఆయన శనివారం అవగాహన కల్పించారు. రాష్ట్రీయ కృషివికాస్ యోజన కింద డ్రోన్ పంపిణీ చేసిన అనంతరం దానిని ఏవిధంగా వినియోగించాలో ఆయన హెచ్‌డీహళ్లి పంచాయతీలోని ఓ రైతు పొలంలో రైతులకు చూపించారు. డ్రోన్ 8 నుంచి 10 నిమిషాలలో ఎకరా పొలంలో పది లీటర్లు నీటితో పురుగుల మందులు, నానో యూరియా, నానోడీఏపీ నానోకాంప్లెక్స్ వంటి ద్రవరూపాలను కూడా స్ప్రేచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ఉమేష్, సింగిల్‌విండో అధ్యక్షులు కుమారస్వామి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ యాదవ్ పాల్గొన్నారు.

'సమస్య పరిష్కారానికి చర్యలు'

మడకశిరటౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధిలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారం కోసం అన్ని చర్యలు తీసుకొంటున్నామని నగర పంచాయతీ చైర్మన్ నరసింహరాజు తెలిపారు. పాత పైప్‌లైన్ స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. శనివారం పట్టణంలో తాగునీటి పైప్‌లైన్ పనులను ప్రారంభించారు.

రోడ్డు ప్రమాదంలో కర్ణాటక వాసి మృతి

చిలమత్తూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని 544-ఈ జాతీయ రహదారిపై కొడికొండ చెక్‌పోస్టు సమీపంలో మరవకొత్తపల్లి బీసీ కాలనీ వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్ణాటక వాసి మృతి చెందాడు. మరవకొత్తపల్లి బీసీ కాలనీలో ఉన్న విరాట్ ప్యాలెస్ కల్యాణమంటప ప్రాంగణం నుంచి అంజినప్ప తన ద్విచక్రవాహనంలో రోడ్డుపైకి వస్తుండగా అదే సమయంలో చిలమత్తూరు నుంచి కొడికొండ చెక్‌పోస్టు వైపు వేగంగా వచ్చిన బొలేరో ఢీకొంది. ప్రమాదంలో అంజినప్ప అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని డ్రైవర్ అక్కడే ఆపేసి పరారయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేస్తున్నారు. మృతుడు కర్ణాటక వాసి అని, పూర్తి సమాచారం తెలియాల్సి ఉందని పోలీసులు పేర్కొన్నారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన

పెనుకొండ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీకళాశాలలో నైపుణ్యాభివృద్ధి సంస్థ సీడప్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళకు విశేష స్పందన లభించింది. శనివారం కళాశాల ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళకు ప్రముఖ కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు. మొత్తం 96మంది ఇంటర్వ్యూకు హాజరుకాగా 56 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. అనంతరం ప్రిన్సిపాల్ జయప్ప మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ మూడు నెలలకోసారి ప్రతి నియోజకవర్గంలోనూ జాబ్‌మేళ నిర్వహిస్తున్నారని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐక్యూ కోఆర్డినేటర్ యశోదరాణి, నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్లేస్‌మెంట్ అధికారి తేజ్‌కుమార్‌రెడ్డి కేంద్ర కోఆర్డినేటర్ గణేష్, సీడప్ కళాశాల సిబ్బంది హాజరయ్యారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

సోమందేపల్లి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎస్‌ఎల్‌పి కంపెనీ ఎదుట జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తిని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందినట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు. మృతుడు గళ్లచొక్క, నిక్కర్ ధరించి ఉన్నాడన్నారు. ద్విచక్రవాహనంపై వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మృతిచెందినట్లు తెలిపారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఆచూకీ తెలిసినవారు తమను సంప్రదించాలన్నారు.

నిధులు మంజూరు

గోరంట్ల, నవంబరు15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాలకు సంబంధించి సీసీరోడ్ల నిర్మాణానికి ఎన్‌ఆర్‌ఇజిఎస్ ద్వారా రూ.2.83కోట్లు మంజూరైనట్లు టీడీపీ కన్వీనర్ బాలక్రిష్ణచౌదరి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మంత్రి సవిత నిధులు మంజూరు చేయించడం జరిగిందన్నారు. 44 గ్రామాల్లో సీసీరోడ్డు పనులకు త్వరలో మంత్రి భూమి పూజ చేస్తారన్నారు.

కారుబోల్తా.. వ్యక్తికి గాయాలు

రొద్దం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కారు బోల్తాపడి వ్యక్తి గాయపడ్డాడు. పావగడ తాలూకా పరిధిలోని వెంకటంపల్లి గ్రామానికి చెందిన మంజు కారు శుక్రవారం అర్ధరాత్రి కోగిర వద్ద బోల్తాపడింది. బ్రిడ్జి మలుపువద్ద వేగంగా వెళ్తూ కారు అదుపుతప్పి పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో స్వల్పగాయాలతో మంజు బయటపడ్డాడు. తిరుమణి నుంచి బెంగళూరుకు ఓ పార్శిల్‌ను ఇచ్చి తిరుగు ప్రయాణంలో వెళ్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. అయితే అర్ధరాత్రి బంధువులకు ఫోన్‌చేసి ద్విచక్రవాహనం ద్వారా స్వగ్రామానికి తిరిగి వెళ్లిపోయారు.

'కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుంది'

మడకశిర రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటుందని మండల కన్వీనర్ నాగరాజు తెలిపారు. మండలంలోని గంతలపల్లి గ్రామానికి చెందిన పార్టీ నాయకుడు వెంకటస్వామి అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఆయన్ను నాయకులు పరామర్శించారు. వెంకటస్వామి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.



